క్లుప్తంగా

దీపోత్సవం



చెన్నారావుపేట : కార్తీక మాసం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సిద్ధేశ్వరాలయంలో భక్తులు మంగళవారం దీపోత్సవ వేడుక నిర్వహించారు. దీపాలను వెలిగించి భక్తి చాటారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యుడు ములుక ఐలయ్య మాట్లాడారు. కార్తీక మాసంలో రోజూ దీపోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు విధిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు కంది విజయ, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి



గీసుకొండ : సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఇందిర, అక్తర్ ఆకాంక్షించారు. మండలంలోని మరియపురంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు లింగ ఆధారిత హింస, సున్నితత్వం, రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడతామని విద్యార్థులతో అభివాదం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, ఉపాధ్యాయులు శ్రీలత, పావని, సందీప్, ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత కీలకం

చెన్నారావుపేట : ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత కీలకమని సీఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని కోనాపురం, చెన్నారావుపేట, ఉప్పరపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రైతులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఎస్సై రాజేశ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలి

నల్లబెల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని ఆ యూనియన్ మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పాటుపడుతోందని చెప్పారు. ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ఫలాలు అందించేందుకు రాష్ట్ర అధ్యక్ష పదవికి, ప్రభుత్వ ఉద్యోగానికి శ్రీపాల్‌రెడ్డి రాజీనామా చేయడానికి సైతం సిద్ధపడ్డారని గుర్తు చేశారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగోన్నతులు, బదిలీల షెడ్యూల్ ఇప్పించిన ఘనత శ్రీపాల్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన మాదాసి కొమురమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ననుమాస వీరస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పరామర్శించారు. అనంతరం 50 కిలోల బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు ననుమాస కరుణాకర్, బండారి సత్యం, నాయకులు పోలేపల్లి భిక్షపతి, శంకేసి రంజిత్, మాదాసి రమేశ్, బొత్త, మైదం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఆర్‌ఆర్' ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండలంలోని జింకురాంతండాకు చెందిన బాదావత్ మంగ్యానాయక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరామర్శించారు. అనంతరం బియ్యం, వంటనూనె అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోతు సుందర్‌నాయక్, భాను, ధూమ్‌సింగ్, ఫౌండేషన్ ప్రతినిధులు గజవెల్లి ప్రసాద్, యూసుఫ్, గుగులోత్ జగన్, బీక్యా, అనిల్, సురేశ్, సోములు, టీక్యా, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పర్వతగిరి : ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానిని మరొకటి ఢీకొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బైపాస్ రోడ్డులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. రాయపర్తి మండలంలోని కొత్తూరుకు చెందిన నాల్లం రవి బైక్‌పై కొత్తూరు దిశగా వెళ్తుండగా కల్లెడ నుంచి పర్వతగిరి వైపు చింతనెక్కొండకు చెందిన వ్యక్తులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

వణుకుతున్నా.. చలించరా?

- బీసీ హాస్టల్ విద్యార్థుల వెతలు
- వాటర్ హీటర్ కూడా లేని దుస్థితి



చలిలో నేలపై పడుకున్న విద్యార్థులు

నల్లబెల్లి : చలికాలం మొదలైన నేపథ్యంలో స్థానిక బీసీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులు చలికి వణుకుతున్నారు. రాత్రిళ్లు నేలపైనే నిద్రిస్తుండడంతో చలి తీవ్రతకు గురవుతున్నారు. హాస్టల్ గదులన్నీ శిథిలమవడమే కాకుండా తలుపులకు, కిటికీలకు మరమ్మతు చేయించాల్సి ఉంది. అధికారులు, ప్రభుత్వం చలించడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలోని బీసీ బాయ్స్ హాస్టల్‌లో 34 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 8 గదులు ఉండగా అన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. కేవలం రెండు గదుల్లో మాత్రమే విద్యార్థులు వసతి పొందుతున్నారు. సదరు గదుల పైకప్పు పెచ్చులూడుతుండడంతో విద్యార్థులు భయపడుతూనే కాలం వెళ్లదీస్తున్నారు. విద్యార్థులకు కార్పెట్‌తోపాటు బెడ్‌షీట్లు పంపిణీ చేసి రగ్గులను విస్మరించిన దుస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి రగ్గులు తెచ్చుకుంటున్నా మరికొందరు విద్యార్థులు పాతవి, చిరిగిన వాటితోనే సర్దుకుంటున్నారు. దోమల బాధతోనూ విద్యార్థులు అవస్థ పడుతున్న పరిస్థితి నెలకొంది. వాటర్ హీటర్ కూడా లేదు. చలి తీవ్రత నేపథ్యంలో చల్లటి నీటితో స్నానం చేస్తుండడంతో అనారోగ్యం బారిన పడుతున్నట్టు కనపడుతోంది.



తలుపు లేని కిటికీ, మరమ్మతు చేయాల్సిన దర్వాజ

సమస్యలు పరిష్కరిస్తాం



హాస్టల్ సమస్యలు పరిష్కరిస్తాం. విద్యార్థులు ఉంటున్న గదుల తలుపులు, కిటికీలకు మరమ్మతు చేయించడంతో పాటు విద్యార్థులకు రగ్గులు అందించే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. హాస్టల్ శిథిలమైన విషయాన్ని గతంలో అధికారులకు నివేదించాను.

-రాకం రాకేశ్, ఇన్‌చార్జ్ వార్డెన్

ప్రావీణ్యం పెంచడమే చెకుముకి లక్ష్యం



నర్సంపేట : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సారయ్య, తదితరులు

నర్సంపేట : విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, ప్రావీణ్యం పెంచడమే చెకుముకి లక్ష్యమని ఎంఈఓ కొర్ర సారయ్య తెలిపారు. పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో చెకుముకి సైన్స్ సంబరాలు-2024 కార్యక్రమ వాల్‌పోస్టర్లను జన విజ్ఞాన వేదిక (జేవీవీ) పట్టణ అధ్యక్షుడు కుమార్‌రెడ్డితో కలిసి ఎంఈఓ సారయ్య మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు చెకుముకి పోటీల్లో ప్రతిభ చాటేలా ప్రోత్సహించాలని సైన్స్ ఉపాధ్యాయులను కోరారు. అనంతరం జేవీవీ పట్టణ అధ్యక్షుడు కుమార్‌రెడ్డి మాట్లాడారు. సమాజంలో అశాస్త్రీయ విధానాన్ని పారద్రోలి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చేలా విద్యార్థి దశలోనే చైతన్యవంతం చేసే దిశగా ఏటా చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 7న పాఠశాల, 21న మండల, 21న జెడ్పీ, 28న జిల్లా స్థాయిల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు పాల్గొని ప్రతిభకు పదును పెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి బుర్ర నవీన్, జేవీవీ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

ఖానాపురం : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఎస్సై రఘుపతి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి-2024 వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. పాఠశాల, మండల, జెడ్పీ, జిల్లా స్థాయిల్లో ప్రతభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి గుగులోతు సుధాకర్, బాధ్యులు పెండెం భాస్కర్, రామ్మోహన్‌రావు, నాయుడు, రామలక్ష్మి, రహమున్నీసా, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

మురుపాలలో రోగ నిరోధక శక్తి ఎక్కువ



ఖానాపురం : ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిశువుకు పుట్టిన గంటలోపు తల్లిపాలనే అందించాలని సూచించారు. ముర్రుపాలు తల్లి బిడ్డ సంరక్షణ అవసరమని చెప్పారు. ముర్రుపాలలో మాంసకృతులు, ఖనిజ లవణాలు, కొవ్వు పదార్థాలు ఎక్కువ ఉంటాయని తెలిపారు. తక్కువ బరువుతో పుట్టిన పిల్లలను మెత్తని నులి దుస్తువుల్లో ఉంచాలన్నారు. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, కీటక జనిత వ్యాధుల నిర్మూలనకు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో వైద్యులు రుచిత, కల్పన, సునీత, సిబ్బంది రాజయ్య, దామోదర్‌రెడ్డి, కనకలక్ష్మి, సునీత, సుజాత, జ్యోతి, వినోద, ప్రతిభ పాల్గొన్నారు.

నియామకం



నర్సంపేట : బీసీ పవర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ పవర్ దివ్యాంగుల విభాగం జిల్లా కన్వీనర్ మోడెం రామకృష్ణ గౌడ్ బీసీ నియమితులయ్యారు. ఈ మేరకు రామకృష్ణకు రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలో విలేకరులతో రామకృష్ణ మాట్లాడారు. బీసీల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు. గ్రామాల్లో కమిటీలు వేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన డివిజన్ అధ్యక్షుడు బాల్నె సుభాశ్, కార్యదర్శి ఆబోతు అశోక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా..



నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నాగెల్లి ఎల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా కనకం సాల్మన్‌లను నియమించినట్లు జిల్లా చైర్మన్ నరుకుడు వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎల్లయ్య, సాల్మన్ మీడియాతో మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి పాటుపడతామని చెప్పారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న జయపాల్‌రెడ్డి, సిబ్బంది

వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారా అగ్నిప్రమాదాలను నివారించొచ్చని స్థానిక అగ్నిమాపక అధికారి జయపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అగ్ని, గ్యాస్, విద్యుత్ ప్రమాదాల సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జయపాల్‌రెడ్డి మాట్లాడారు. ప్రమాదాలను నివారించేలా విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకునేలా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, సంధ్యారాణి, తిరుపతి, డాక్టర్ వేణుమాధవ్, శోభారాణి, రాజ్‌కుమార్, సువర్ణవేణి, స్వరూప, హరిబాబు, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న పార్వతమ్మ

నర్సంపేట రూరల్ : గ్రామాల్లో మహిళలు కాంగ్రెస్ సభ్యత్వాలను అత్యధికంగా నమోదు చేయడం అభినందనీయమని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, గుంటూరుపల్లి మాజీ సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ అన్నారు. మండలంలోని గుంటూరుపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధిష్టానం పార్టీలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం దిశగా మహిళలు సభ్యత్వాలను వేగవంతం చేసి నర్సంపేటను మొదటి స్థానంలో నిలిపారన్నారు. మహిళల అభ్యున్నతికి పార్టీ, ప్రభుత్వం తోడ్పాటు అందిస్తాయని చెప్పారు. సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను మహిళలు వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని సూచించారు.

ఉద్యమాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం



నివాళులర్పిస్తున్న రాంచందర్, నాయకులు

ఖానాపురం : ఉద్యమాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐఎంఎల్ జోనల్ కమిటీ నాయకుడు ఈరెల్లి రాంచందర్ స్పష్టం చేశారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మండలంలోని మనుబోతులగడ్డలో మంగళవారం ఆ పార్టీ జెండాను రాంచందర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పలువురు పోరాడి ప్రాణాలర్పించారని చెప్పారు. అమరుల అమరుల త్యాగాలను సమాజంలోని ప్రతిఒక్కరూ స్మరించాల్సిన అవసరం ఉందన్నారు. అమరుల ఆశయాల స్ఫూర్తితో పోరాటాలు నిర్మిస్తామని తెలిపారు. తొలుత అమరులకు ఉద్యమ నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, రామ్మూర్తి, రాజు, వీరన్న, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ చార్ట్ మేరకే విధులు నిర్వర్తించాలి

నర్సంపేట రూరల్ : ఆశవర్కర్లు జాబ్ చార్ట్ ప్రకారమే విధులు నిర్వర్తించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలవల లలిత కోరారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని భానోజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌చంద్రకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం యువరాజు, లలిత మాట్లాడారు. కమిషనర్ జారీ చేసిన జాబ్ చార్ట్ సర్క్యులర్, మెమోను మెడికల్ ఆఫీసర్లు పాటించాలని కోరారు. ఇప్పటికీ కొన్ని సబ్ సెంటర్లలో ఆశవర్కర్లకు డ్యూటీ చేయాలని ఏఎన్‌ఎంలు ఒత్తిడి తీసుకొస్తున్నారని చెప్పారు. ఏఎంసీ టార్గెట్ పేరుతో ఆశవర్కర్లను వేధించడం సరికాదన్నారు. ఈనెల 11న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వామని, త్వరలో కార్యాచరణ చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శామ, రమ, మంజుల, శ్రీలత, సరిత, అనిత, సునీత, రజిత పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



నర్సంపేట రూరల్ : పట్టణంలోని శాంతి నగర్‌లోని ముని ముద్దల సంపత్ నివాసంలోని పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేసి నలుగురిని అరెస్టు చేయడంతోపాటు రూ.2,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, ఎస్సై రవికుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. సంపత్ ఇంట్లో పేకాట స్థావరం నడుస్తోందన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి కార్జాల శ్రీనివాస్, మనిముద్దల సంపత్, వేల్పుల వీరభద్రస్వామి, బొంత రాజులను అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు.

కమ్యూనిస్టు మల్లయ్య సేవలు మరువలేనివి

దుగ్గొండి : నికార్సయిన కమ్యూనిస్టుగా మండలంలోని గిర్నిబావికి చెందిన చెల్పూరి మల్లయ్య ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు తెలిపారు. మల్లయ్య ఇటీవల మృతి చెందగా గ్రామంలో కొంగర నర్సింహస్వామి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సంతాప సభకు బాబు అతిథిగా హాజరై మాట్లాడారు. మల్లయ్య ప్రాణం ఉన్నంత వరకు పేదల పక్షాన పోరాటాలు నిర్మించారని చెప్పారు. బూర్జువా పాలకుల తప్పుడు విధానాలపై అలుపెరగని పోరాటాలు నిర్మించడమే మల్లయ్య నిజమైన నివాళి అని తెలిపారు. తొలుత మల్లయ్యకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు కోరబోయిన కుమారస్వామి, భూక్యా సమ్మయ్య, హనుమకొండ శ్రీధర్, బొల్ల సాంబయ్య, చెల్పూరి మొగిలి, పుచ్చకాయల నర్సింహారెడ్డి, కోడెం రమేశ్, అక్కపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు కాట్ల భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



నెక్కొండలో..

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా నాగుల చవితిని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పాముల పుట్ట వద్ద పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సంపేట, నెక్కొండ, ఖానాపురం, నల్లబెల్లి, చెన్నారావుపేట, తదితర మండలాల్లోని ఆలయాలు కిటకిటలాడాయి. అర్చకులు, ఆలయాల నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



ఖానాపురం : ధర్మరావుపేటలో..



నల్లబెల్లి : అభయ నాగేంద్రస్వామి ఆలయంలో..



చెన్నారావుపేట : సిద్ధేశ్వరాలయంలో..

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నర్సంపేట : విష్ణును అభినందిస్తున్న శ్రీనివాస్



దుగ్గొండి : విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

నర్సంపేట : పట్టణంలోని మినీ స్టేడియం క్రీడాకారుడు జన్ను విష్ణువర్ధన్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం అభినందించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. విష్ణువర్ధన్ కోచ్ యాట రవికుమార్ నిర్వహిస్తున్న శిబిరంలో శిక్షణ పొందుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌టీఎఫ్ సెక్రటరీ సోనబోయిన సారంగపాణి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చెన్నబోయిన రామదాసు, నర్సంపేట డివిజన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడు గూడెపు భిక్షపతి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి భానోతు దేవీలాల్, జిల్లా ప్రైవేటు పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు నాడెం సంతోశ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంజేపీ విద్యార్థులు..

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ నుంచి డిస్క్ త్రోలో వేణుగోపాల్, లాంగ్ జంప్‌లో అజయ్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య, పీఈటీ సతీశ్, ఏటీపీ సతీశ్, డిప్యూటీ వార్డెన్ శ్రీలత, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యాలయం నుంచి ఏడుగురు పాల్గొనగా ఇద్దరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమని ప్రిన్సిపాల్ అన్నారు.

యోగా పోటీలకు..



వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల స్కూల్ విద్యార్థి శ్రుతి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా శ్రుతితో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన పీఈటీ సోమన్నను స్కూల్ ఆవరణలో హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

స్నేహ సంఘాలతో బాలికల్లో చైతన్యం



సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎం ఈశ్వర్

చెన్నారావుపేట : స్నేహ సంఘాలతో బాలికల్లో చైతన్యం రానుందని ఏపీఎం ఈశ్వర్ అన్నారు. మండలంలోని అమీనాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 14 నుంచి 18 ఏళ్ల వరకు వయస్సున్న బాలికలతో స్నేహ సంఘాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, హక్కులు, ఇతర అంశాలపై సంఘాలు పని చేస్తాయని చెప్పారు. సంఘాలు బాలికలకు బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. బాలికలు విద్యార్థి దశలోనే సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. సదస్సులో స్కూల్ ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజు, సీసీ మాణిక్యం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించండి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఎన్యూమరేటర్లకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. నేటి (బుధవారం) నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రొఫార్మాలో పొందుపర్చిన అన్ని వివరాలను సేకరించాలని సూచించారు. అన్ని అంశాలను పూర్తి స్థాయిలో పూరించాలని, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ఎంఈఓ రత్నమాల, ఏపీఎం శ్రీనివాస్, ఏపీఓ జాకబ్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

నర్సంపేట : మాదిగ కులస్తులు ధర్మ యుద్ధ పోరాటాలకు సిద్ధం కావాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, నియోజకవర్గ కోకన్వీనర్ తడుగుల విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని నారాయణ కోరారు. పట్టణంలోని రాంనగర్‌లో బాణాల రమేశ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ప్రణయ్, విజయ్, నారాయణ మాట్లాడారు. సుమారు 30 ఏళ్లుగా మంద కృష్ణ నాయకత్వంలో జరుగుతున్న పోరాటాన్ని గుర్తించిన క్రమంలోనే ఎస్సీ వర్గీకరణ సమంజసమేనంటూ దేశంలో అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీ సాక్షిగా సానుకూలంగా స్పందించిన తొలి వ్యక్తిగా సీఎం రేవంత్‌రెడ్డి గుర్తింపు పొంది తదనంతరం విస్మరించారని విమర్శించారు. ఇటీవల చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో 11 వేల పోస్టుల భర్తీలో వర్గీకరణ అమలు కాక మాదిగ యువత తీరని అన్యాయానికి గురైనట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మీద తలపెట్టిన పోరాటాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, వేల్పుగొండ రాజు, మాదాసి బాబు, గుండేటి వీరేశం, గొర్రె అనిల్ తదితరులు పాల్గొన్నారు.